# శృంగభంగము



శ్రీ

శ్రీవత్స

మధ్యాహ్నము పన్నెండు గంటలయినది. మండు వేసంగి. అందులో ఆంధ్రదేశములో కృష్ణానదీ తీరానయితే చెప్పవలెనా ! - ఆవస్థను అనుభవించి తీరవలసినదే తప్ప వర్ణించడానికి మాత్రము సాధ్యము కాదు.


అయితే యింజనీర్ల బంగళాలో మాత్రము ఆంధ్ర ప్రబంధకవులు వర్ణించినట్లుగానే వుంటుంది. బంగళాకు ప్రతిద్వారమునా సగంతలుపులు-అరగంటలకు వట్టివేళ్ల తడికెలు కట్టి యిరవైనాలుగు గంటలూ నీళ్లు పోస్తూవుంటే - ఏటి గాలి ఆతడికెల సందులలోనుంచి వస్తూవుంటే - అనుభవమా - ఆ హాయీ అనుభవయోగ్యమే. కాని వర్ణనకు తగము కాదు.

సుందరరావు బంగళాకు యింకా రాలేదు. కడుతున్న కాలవ వంతెనదగ్గర పనికాలేదు. లలితకు తాను ఆలస్యముగా వస్తానని అయినా కబురుచేయలేదు. లలితకు ఆకలి అవుతున్నది. భోజనము చేయడమా, భర్త వచ్చేవరకున్నూ కనిపెట్టుకొని వుండడమా అనే ఆలోచనలో లలిత పడిపోయినది. ప్రతి అయిదారు నిమిషాలకూ ‘బాల్కని’లోకి వచ్చి చూస్తున్నది. మధ్యాహ్నము ఒంటిగంట అయినది. పెనిమిటి జాడాలేదు. ఇదివరలో కాపరానికి వచ్చిన యీ మూడు సంవత్సరాలలో యిట్లా ఎన్నడూ జరగలేదు. ఏమాత్రము ఆలస్యము వున్నప్పటికీ ముందుగా చెప్పేవాడు, ఒకవేళ చెప్పకుండా వెళ్లిపోతే కబురు అయినా ,చేసేవాడు. లలిత ఆకలికి అసలే ఆగలేదని అతనికి తెలుసును.

మళ్లీ బాల్కనిలోకి వచ్చి లలిత చూస్తున్నది. నల్లగా పొడుగాటివాడు - చంకలో ఒక చిన్న పెట్టె - పక్క చుట్టాతో బంగళా ఆవరణలో రోడ్డుమీద అటూ యిటూ చూసుకొంటూ నడుస్తున్న యువకుణ్ణి [illegible]గా లలిత చూసింది. కొంచెము సమీపంలోకి వచ్చేవరకున్నూ అతన్ని పోల్చుకొనలేక పోయింది. దగ్గరకు వచ్చేసరికి కేవల హనుమద్వరప్రసాదలబ్ధుడు గోపాలరావు అయినాడు. చూసే చూడడముతోటే ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచింది. క్షణకాలములో తీవ్రమయిన ఆలోచనా సముద్రములోకి వెళ్లిపోయినది. బుర్ర గిర్రున తిరిగి పోతున్నట్లు అయిపోయింది. అతన్ని ఆమె చూసి యిప్పటికి మూడు సంవత్సరము లయిపోయినది. కాపరానికి వచ్చిన తర్వాత అతను లలితను చూడడము యిదే మొదటి సారియగును.

అట్లాగే - ఆలోచించుకొంటూనే - ఏదో ధ్యాస సమాధిలోకి పోయింది. ఆమెలో సహజమయిన చలాకీ పోయినది. తాను వెళ్లి పలకరించడమా, ఊరుకోవడమా అనే సందేహము వచ్చినది. ఆమె - ఆమెకు తెలియకుండానే మెల్లిగా అడుగులో అడుగువేస్తూ మేడమెట్లు దిగింది. ఇంతలో గోపాలరావు పోర్టికోలోకి వచ్చినాడు. అతన్ని చూసే చూడడముతోటే ఎంతో విషాదముతో వున్నప్పటికిన్నీ తెచ్చిపెట్టుకొన్న చిరునవ్వుతో “ఎక్కడనుంచి రావడము” అన్నది.

“నిన్ననే మాకు సెలవులు ఆరంభమయినవి. నేను బందరునుంచి వస్తున్నాను. నిన్ను చూసి మూడు సంవత్సరాలు అయింది. కండ్లు కాయలు కాసిపోయినవి. ఏమయినాసరే చూసి మరీ పోవలెననుకొని వచ్చాను...” అని సాలోచనముగా ఆమెవంక తేరిపార చూశాడు. ఎండలో వచ్చినందువల్ల దేహమంతా చెమటలు పోసి



వుంది. ఓపిక లేకపోయినప్పటికిన్ని కోటు సంతోషముతో విప్పి అక్కడ కుర్చీకి తగిలించి చతికిలబడ్డాడు.

లలిత పరధ్యానములో నిలుచుని పోయింది. ఇన్ని మంచి నీళ్లు అయినా కావలెనా అని అడగలేదు. ఒక కొంచెము సేపయిన తర్వాత ఎన్నడూ జన్మలో ఎరగని మందగమనముతో లోపలికివెళ్లి శూన్య భావముతో నిలుచున్నది. గోపాలరావు ఇదంతా గమనిస్తూనే వున్నాడు. లేచి ఆమెకు కనబడేలాగు రెండడుగులు వేసి ఆ ముఎదటకివచ్చి "నేను హోటలుకి వెళ్లి భోజనముచేసి వస్తాను" అని ఆమె వంక తేరి పారచూసినాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు... నా భోజనము ఎట్లాగా - యీ అకాలములోనని ఆలోచిస్తున్నావేమో... నేను భోజనముచేసి వస్తానులే... మరిచిపోయినాను - మీ ఆయన వూళ్లో వున్నాడా ఎక్కడికయినా కాంపుకు పోయినాడా?" అన్నాడు మందహాసముచేస్తూ గోపాలరావు.

"ఊఁ... వూళ్లోనే వున్నారు" అన్నది లలిత. అతను బయలుదేరి వెళ్లిపోయినాడు. ఆమె అతన్ని చూస్తూ పడకకుర్చీలో జారగిల బడిపోయింది.

* * *

ఒక్కసారి ఆమె పుట్టిల్లూ - బాల్యమూ కండ్లఎదట వచ్చి నిలుచున్నవి. తండ్రి నిషధయోగ్యుడు. తల్లి శైశవములోనే పోయినది. లలిత ఆమెను ఎరగనే ఎరగదు. వితంతువు శతవృద్ధు మత్తవ ఆమెను పెంచినది. ఆమె అయినా కొద్దికాలమే - లలితకు వివాహము అయ్యేవరకే అంటే పన్నెండో సంవత్సరము వరకే జీవించినది. ఆమె మొత్తముమీద మొగవాళ్ల చేతులలోనే పెరిగింది.

పుట్టిల్లు కేవలము ధర్మశాల. ఒకచెంప తండ్రిని స్తోత్రముచేసి యింత ధనము కొట్టుకొని పోవడానికి వచ్చే వేదాధ్యయన పరులూ యింకొక చెంప సంస్కృత విద్యార్థులూ - మరొకచెంప యింగ్లీషు చదువుకొనే బీద విద్యార్థులూ - అందరికంటే కోర్టు వ్యవహారాల కోసరము వచ్చే ఆయన క్లయింట్లూ - యీ జనభాతో యిల్లంతా ఎల్లప్పుడూ తిరనాళ్లగా వుండేది.

మొగవాళ్లలో కలసి మెలసి తిరగడము వల్లనే కాబోలు లలిత అచ్చంగా ఆంధ్రయువతిలాగా మాత్రము తయారు కాలేదు. చొరవ చేసుకొనడములో ద్రావిడాంగనలాగాను, సౌకుమార్యములో వంగాంగనలాగానూ, దేహదార్ఢ్యములో మాత్రము ఆంగ్లాంగనగానూ తయారు అయినది.

పదిహేనవఏట భర్తృగృహము చేరింది. ఆమె అక్కడ ఒక్కతే. ఆమెను అత్తకోడళ్లలో వుండేవాళ్లు ఎవరునున్నా లేరు.

పెనిమిటి యింజనీరు. ఉభయులూ సమావేశమయిన కాలము సరిగోలాలతో ఒకరినొకరు చక్కగా అర్థము చేసుకొన్నారు. వాళ్లిద్దరకూ అభిప్రాయ భేదములంటూ లేవు. ఆమె అతని పాలిటికి సాక్షాత్తూ పార్వతి. అతనామెకు పరమేశ్వరుడు. వాళ్లిద్దరకూ ఎప్పుడూ ఒక్కటే సందేహము వస్తూవుండేది. ప్రపంచములో భార్యాభర్తలకు ఎందుకు కలతలు - చిక్కులు - మనస్తాపములు - మనస్పర్థలు - వస్తవా అని. ఈ సందేహాన్ని గురించి ఎప్పుడూ వాద ప్రతివాదములు చేసుకొంటూ వుండేవాళ్లు - బహుశః వుభయుల బుద్ధి జాడ్యమువల్ల అటువంటి సంకట పరిస్థితులు ఏర్పడుతూ వుంటవని చివరకు వాళ్లుభయులూ తీర్మానించినారు.

సుందరరావు యింకా యింటికి రాలేదు. అయితే గోపాలరావు అంత ఆకస్మికముగా ఎందుకు వచ్చినాడా అని వూహించడము మొదలు పెట్టినది. ఎన్నో రకములయిన ఆలోచనలు పోయినవి. కాని యిందు నిమిత్తము

వచ్చివుంటాడు అని మాత్రము నిశ్చయించలేక పోయినది. ఆ ఆలోచనతో ఆమెబుర్ర పగిలిపోతున్నది.

*   *   *

సుందరరావు నురుగులు పడుతూ యింటికి వచ్చినాడు. యథాప్రకారం లలిత ఆహ్వానము చేయడానికి పోర్టికోలోకి రాలేదు. పయిన కప్పువంక చూస్తూ మంచముమీద పడుకొని ఆలోచించుకొంటూ వున్నది. సుందరరావును చూసి తుళ్లిపడి లేచింది. అతను ఆమెను చూస్తూ నవ్వుతూ "ఆకలికావడము లేదా" అన్నాడు.

"టయిము ఎంత అయింది"

"ఒకటిన్నర దాటి పోయి వుంటుంది"

"అయితే యీలోపల మీరు స్నానం చేస్తూవుండండి. నేను వెళ్లి వడ్డన చేయిస్తాను"

స్నానాదికము అయిపోయిన తర్వాత వుభయులూ భోజనానికి కూచున్నారు. లలిత యెప్పటిలాగా కబుర్లు చెప్పకుండా మౌనముగా భోజనము చేస్తున్నది. కాపరానికి వచ్చిన యీ ఒకటిన్నర సంవత్సరములో యింత సేపు మౌనముతో ఆమె ఎన్నడూ వుండలేదు. సుందరరావుకు కొంచెము ఆశ్చర్యముగానే తోచింది. ఆమెను పరికిస్తూ ముసిముసి నవ్వులతో "ఏమిటి గొబ్బెమ్మలాగా కూచుని తింటున్నావు. కదలడము మెదలడము అయినా లేదు," అన్నాడు సుందరరావు.

"అట్లానా - అవును ఆలోచిస్తూనే వున్నాను... పాపము గోపాలరావు యెంత యిబ్బందిపడుతూ చదువుకొంటున్నాడో ?... ఎవళ్లయినా డబ్బున్నవాళ్లు పిల్లనిచ్చి పెండ్లిచేసి అతనికి చదువు చెప్పించగూడదూ ?"

"ఆ మహానుభావుడు గోపాలరావెవరు ?"

"మాయింట్లో వుండి చదువుకొంటూ వుండేవాడే - గోపాలరావు"

"వాడా అకోతిరూపమూ - వాడూ, వాణ్ణెవతె పెండ్లిచేసు కొంటుంది ? అయినా యిప్పుడు వాడి ప్రసక్తి ఏం వచ్చింది."

"ఇందాక మనయింటికి వచ్చాడు. పెట్టె పక్క చుట్టా వరండాలో పెట్టి వెళ్లాడు. బయట ఏమి వున్నవో చూడనయినా చూశారూ... ఏడివున్నాక పోయినా మీకు తెలియదుగదా ?



"నీవు వుండగా ఏదివున్నా పోయినా నాకేం సంబంధం లేదు."

"సరే లెండి. పోయిన తర్వాతగా అనుకోనేది"

"పోయిన తర్వాత అనుకోడ మెందుకు?"

కోపంతో - "ఎప్పుడూ వేళాకోళమేనా - వేళాపాళా లేకుండా? అయితే యింత ఆలస్యము యెందుకయిందండీ?"

"కైఫీతు వ్రాయించి దాఖలు చేస్తాను"

"ఇవ్వాళ శుక్రవారం. సాయంత్రం దుర్గాలయానికి వెళ్లవలె ననుకొంటున్నాను. మీరు రాక తప్పదు."

"నాకీరోజు సాయంత్రం పనిలా తీరదు. నీవు వెళ్లేట్లయితే వెళ్లు."

"అబ్బ ఏమిటండీ అంత తీరని పని. పునాదులకు గోతులు తవ్వడమేగా అక్కడ చేస్తున్నది"

"స్టీంహేమర్లు అనుగ్రహముతో సులభ్యమైనంతా అయిపోయింది. నేను లేంది పనిచేయించడం వాళ్లచేత కాదు."

"స్టీం హేమర్లంటే సుత్తెలే కాదూ. మీ వంతెన దగ్గర సుత్తెలతో పనేమి వుంటుందండీ"

"ఎప్పుడయినా చూస్తేనా - లేకపోతే చదువుకొంటేనా - రెండూ లేదు. సిమింటుతో దిమ్మెలు తయారు చేస్తారు. ఆ దిమ్మెలు భూమిలోకి పునాదులకు గాను దింపడానికి స్టీం హేమర్లతో కొడతారు. అవి యెంతలోతు కావలెనంటే అంతలోతుకు పోతవి."

"అయితే నన్నుకూడా మీతో తీసుకొని వెళ్లి చూపిస్తారూ?"

"తప్పకుండా వెళుదాం. అయితే నీ ముస్తాబు ఈ సంవత్సరంలో అవుతుందా?"

"ఓ ఒక్క నిమిషంలో—" అంటూ గబగబ భోజనం చేయడం పూర్తిచేసింది.

"అయితే యింత ఎండలో బయలుదేరుతావా?" అన్నాడు.

"అవును. నాకు తెలుసును. ఎగగొట్టే పద్ధతి. మీ కిష్టం లేకపోతే రావద్దని చెప్పగూడదూ?—"

"నీ మొహం. సాయంత్రం నాల్గు గంటలకు వెళుదాము." అన్నాడు.

ఇంతలో గోపాలరావు వచ్చాడు. అతన్ని అత్యంతాదరంతో చూసి లోపలికి రమ్మని, భర్తను సమీపించి "ఇతని పేరు గోపాలరావు. మా యింట్లో వుండి చదువుకొన్నాడు. ఇప్పుడు బందరులో బి.ఏ. చదువుతున్నాడు. మేమిద్దరం చాలా సావాసంగా వుండేవాళ్లం. నాకితనంటే ఎంతో యిష్టం" అన్నది. సుందరరావు ఉభయులవంక మందహాసముతో చూస్తూ "కూర్చో సంతోషం" అన్నాడు. లలిత అవతలకు వెళ్లిపోయింది. గోపాలరావును ఏవేవో కబుర్లడుగుతూ అతన్ని నఖశిఖ పర్యంతమూ పరీక్షించినాడు. కబుర్లు మానేసి బల్లమీద వున్న "కాంక్రీటు" అనే పత్రిక తీసుకొని పేజీలు తిరగవేయడం మొదలు పెట్టాడు. అతనికి విపరీతంగానే తోచింది. శరత్కాల పూర్ణిమకూ అమావాస్యకూ - ఉత్త అమావాస్య కాదు - వర్షకాలంలో కారు మబ్బులతో వుండే అమావాస్యకూ ఎంతభేదముంటో అంతభేదం లలితకూ - గోపాలరావుకూ వుంది. వీళ్లిద్దరకూ అంతస్నేహం ఎట్లా అయిందో వూహించలేక పోయినాడు.

రవిచంద్రులు ఏకరేఖాగతులయినప్పుడు అమావాస్య అనీ దూరగతులయినప్పుడు పూర్ణిమ అని అతను అనుకోన లేక పోయినాడు.

సింగారించుకొని లలిత బయలుదేరేసరికి షుమారు నాల్గు గంటలయింది. ఆ అకాలంలో అకారణంగా ఆకాశాన మబ్బులు పరుగెత్త సాగినవి. సుందరరావు భార్యతో "త్వరగా వెళుదాం - దారిలో వర్షంవస్తే తడిసి ముద్దయి పోతావు" అన్నాడు.

"వాన రాదు లెండి. నే బయలుదేరుతున్నానని చల్లబడ్డది లెండి" అని బయలు దేరింది.

వాళ్లెక్కడికి వెళుతున్నారో గోపాలరావుకు తెలియదు. తానుకూడా వాళ్లవెంట వెళ్లవలెనను కొన్నాడు. సుందరరావు అతనివాలకం చూశాడు. అతని స్కూట్లో

నుంచి మాటవచ్చే లోపలనే లలిత "గోపాలం - రాత్రికి భోజనం మాయింట్లో చెయ్యాలి - మేము చీకటిపడేసరికల్లా వచ్చేస్తాం" అన్నది.

"ఊళ్లో..." అని గోపాలరావు అనేసరికల్లా "ఊళ్లో బంధువులుంటే వున్నారులే - మేము యింటికి వచ్చేలోపల పోయి, ఇక్కడ మాయింట్లో భోజనం చేస్తానని చెప్పిరా" అంది. సుందరరావున్నూ "అవును సంగతులూ, మేము వచ్చేలోపల చెప్పిరా. ఇక్కడ భోజనం చేతువుగాని" అన్నాడు. గోపాలరావు ఏమీ మారు మాట చెప్పలేక పోయినాడు.

తినను అవిసంగా తోసివేసి లలితవెళ్లి పోయినందుకు గోపాలరావుకు ఎంతో కోపం వచ్చింది. అట్లా చేస్తుందని అతను కలలో నయినా అనుకోలేదు. అంతవరకూ ఏదో సమయం చూడాలను కొంటూవున్న వాడల్లా ఆనాడు రాత్రే ఏమయినా సరే సమయం చిక్కించుకోవాలను కొన్నాడు. ఏమో అనుకోడం కాదు. నిశ్చయించు కొన్నాడు. హరిహరబ్రహ్మాదులు అడ్డం అయినా మానకూడదను కొన్నాడు. ఆమెకు అంతగర్వమా! ఆరాత్రికి ఆమెను అవమానించి తీరవలెనను కొన్నాడు.

* * *

స్టీంహాసుగు పని చేయడానికి మొరాయించింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభంలేక పోయింది. యంత్రాల విషయం తెలిసిన యింజనీరు బందరులో వున్నాడని అప్పటికప్పుడే కారులో సుందరరావు బందరు బయలుదేరాడు. ఆరోజు రాత్రికో - కాకపోతే మర్నాటి వుదయానికో వస్తానని చెప్పి వెళ్లిపోయినాడు.

చీకటి పడుతున్నది. ఇంకా గోపాలరావు రాలేదు. అతను ఏకారణంవల్ల నయినా ఆరాత్రికి రాకపోతే బాగుండునని అనుకొన్నది లలిత. బుర్రలో ఏవేవో వూహలు గిర్రున తిరుగుతున్నవి. ఆరాత్రే భర్త యింట్లోలేకుండా వెళ్లవలసి వచ్చినందుకు అమితమయిన విచారం వేసింది. ఏమీ తోచదు. ఉడ్డు గుడుచుకొన్నట్టుగా వుంది.

ఎదట వున్న సుందరరావు బొమ్మ పెద్దది (ఎన్లార్జిమెంటు) కనబడుతూవుంది. దాన్ని చూసిన కొద్దీ ఆమెకు దిగులు ఎక్కువయిపోయింది. అప్రయత్నంగానే రెండు మూడు కన్నీటి బిందువులు ముత్యాలులాగా చెక్కిళ్లమీద దొర్లినవి. అంత మంచివాడికి అంత అమాయకుడికి - అంత సమర్థుడికి - అంత గొప్పవాడికి అంత కోమల హృదయుడికి తనంత దొంగ - దుర్మార్గంగా ప్రవర్తించిన మనిషి భార్య కావడం దురదృష్టం అనుకొన్నది...... ...గర్వించింది; గర్వించిపోయింది. అందుకు ఏమి ప్రయోజనం ఏమున్నది......" ఆలోచన సరంపరలలో పడి మనస్సు డోలాయమానం అయిపోయింది. అయితే అతన్ని చేరిన యీ ఇరవైన్నర సంవత్సరములలో తన ప్రవర్తనలో అణగింప అంత అయినా లోపము లేనందుకు ఎంతో గర్వం వచ్చింది. కాని గర్వించిన విషయం అతనికి తెలిస్తే... అనే ప్రశ్న కలిగేసరికి ఆబాధ భరించలేక పోయింది. ఒకలక్ష తేళ్లు కుట్టినట్టుగా అయిపోయింది. ఇక అబాపు ఎదట వుండలేక పోయింది. లేచింది. అయోమయంగా అటూ యిటూ పచార్లు చేసింది. ఆమెకు ఏమీ కనబడడం లేదు. అంతా శూన్యంగా తోచింది.

భోజనానికి రమ్మని వర్తమానం వచ్చింది. మరో కరు భోజనానికి వస్తారనీ, వారు భోజనం చేసిన తరువాత తాను భోజనం చేస్తాను అని చెప్పి లేచి మేడమీదికి వెళ్లిపోయింది.

ఒళ్లుఅంతా బరువుగా వుంది. ఏమీ తోచడంలేదు. ఎదట దీపాలు వెలుగుతున్నవి కాని ఆమెకు కటిక చీకట్లో వున్నట్టుగా వుంది. ఎట్లాగో మంచముమీద వాలింది. పెద్దపెట్టున ఏడవవలెనను కొన్నది. కాని ఏడ్పురాలేదు. కుమిలిపోతున్నది......

అప్రయత్నంగా లోపల లోపల ఏడుపు ఆరంభమయింది. కండ్లవెంట ఏకధారగా నీళ్లు కారడం మొదలు పెట్టింది. ఎంతోసేపు అయింది. ఆమె యీ లోకంలో లేదు. ఒక శూన్య లోకంలోకి వెళ్లిపోయింది. ఒక విధమయిన జడత్వం వచ్చింది. పిలవడానికి వచ్చిన వంటమనిషి ఆమె నిద్రపోతున్న దనుకొని వెళ్లిపోయింది.

రాత్రి పదకొండు గంటలు కావచ్చినది. ప్రపంచమంతా గాఢసుషుప్తిలో వుంది. ఇంకా వేడిగాలి పయి

రకు తిరగలేదు. ముఖమంతా చల్లబడి పోయింది. దిండు అంతా తడిసిపోయింది. బోర్లాపడుకోడం నుంచి ఆమె ముఖముఅంతా తడిసిపోయింది. ఎవరో పయికివస్తూవున్న చప్పుడయింది. భోజనానికి తిరిగీ వర్తమానము వస్తున్నది కాబోలు ననుకొన్నది. తనముఖస్థితి యితరులు గమనించ కూడ దనుకొని వెంటనే లేచి ముఖము కడుగుకొని అద్దము ఎదటికివచ్చి నిలుచుని ముఖము చూసుకొంటున్నది.

తలుపు తెరుచుకొని గోపాలరావు ప్రవేశించడము అద్దములో కనిపించింది. వెంటనే గిరుక్కున వెనక్కు మళ్లింది. అతను మంచం సమీపించ బోతున్నాడు. "అదుగో ఆ సోఫాలో కూర్చో"మని మందహాసంతో ఆజ్ఞాపించింది. పక్కకు వెళ్లి అతను సోఫాలోనే కూర్చున్నాడు. ఆమెకు తెలియకుండానే వెళ్లి మంచంమీద కూర్చున్నది.

ఏమి మాట్లాడవలెనో-ఏమని ప్రారంభించవలెనో యిద్దరికీ తెలియలేదు. ఒకరిమొఖం ఒకరు చూసుకోడం మొదలు పెట్టారు. గోపాలరావుకు ఆమె ప్రశాంతవదనాన్ని చూసి కోపం రావడం మొదలు పెట్టింది. కోపం ఎక్కువయిన కొద్దీ బుంగమూతి పెట్టుకొని కూర్చున్నాడు. అతని ముఖము - అతని అంగవికారపు ముఖము చూసిన కొద్దీ ఆమెకు నవ్వువచ్చింది. ఎట్లాగో ఆపుకొన్నది. ఆమె ముఖభంగి చూసిన కొద్దీ అతనికి కోపం ఎక్కువయి కండ్లు ఉరిమాడు. ఆమె యిక ఆపుకోలేక పక్కున నవ్వింది.

"అవును, నవ్వుతావు. నీ సంగతి నాకప్పుడు తెలియలేదు." అంటూ గోపాలరావు లేవబోయినాడు. ఆమె మంచముమీద నుంచి చటుక్కునలేచి అతనిదగ్గిరకు వెళ్లి నిలుచుని ఏదో అనబోయింది. అతను ఆమెను దగ్గిరకు లాగుకొన బోయినాడు. అతన్ని ఆమె వారించి కొంచెం దూరంగా నిలుచుని ముఖము చిట్లించి" ఏమిటి ఎంత కాలం పోయినా చిన్నతనపు చేష్టలు... నేను యింకొకరి దాన్ని అన్న సంగతి మరిచిపోయినావా? అసహ్యాం కాదూ......

"అబ్బో... ఈసంగతి నీకు తెలిసి ఎంతకాల మయింది. ఆనాడు సాయంత్రం మీతోటలో..."

"అబ్బబ్బ... ఆసంగతు లన్నీ జ్ఞాపకం చేయకు. నాకు ఏడుపువస్తుంది... ఏదో తెలియక అయిపోయింది."

"అమ్మో - ఎంత పతివ్రతవు అయిపోయినావు ఒకటిన్నర సంవత్సరములో!" అంటూ లేచి కౌగలించుకోబోయినాడు. ఆమె గట్టిగా తోసివేసింది. అతను సోఫామీద పడిపోయినాడు. ఆమె అతనిపక్కనే కూర్చుని "అవును అదంతా తెలియని కాలము. మనమిద్దరమూ తెలియకనే తప్పుచేశాము. ఇప్పుడు తెలుసుకొన్నాం - కాబట్టి మరిచిపోదాం" అన్నది.

"ఇప్పుడిట్లా అంటున్నావూ. జ్ఞాపం తెచ్చుకో యింకా రెండుమూడు రోజులకు నీభర్త వస్తాడనంగా - ఎప్పుడూ నీదాన్నే - నేను ఎక్కడవున్నా నీదాన్నే - అని ఎన్నిఒట్లు వేసుకొన్నావో జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు మాటమాత్రం నీ సంగతి నేను ఎవరితో నయినా అన్నట్లయితే ఏమయి పొయ్యేదానివి?

"అవును. నిజమే తెలియక చేశాను. నన్ను మన్నించు. అదంతా మరిచిపోదాము. అదంతా మరిచి పోవడమే మన యిద్దరికీ మంచిది......నన్ను క్షమించు...నీవు బీదస్థితిలో వున్నావు. నీకు కావలసిన ధనసాయమంతా చేస్తాను. నీవు బి. ఏ. అయిన తర్వాత నీకేదయినా ఉద్యోగము దొరికేదాకా నేను నిద్రఅయినా పోను. నన్ను నమ్ము."

"ఇదివరకటి వాగ్దానాలు ముందు చెల్లిస్తే యీ కొత్త వాగ్దానాలు నమ్ముతాను"

"ఎబ్బె అట్లావద్దు. అవన్నీ మరిచిపో. నిజంగా నీకు ఎంతయినా సాయం చేస్తాను. నామాట నమ్ము.

"నమ్మడ మెట్లా?"

"నేను చెపుతున్నానుగా. నమ్ము. నిజంగా నా మాట నమ్ము."

"నాకదంతా తెలియదు... నేను నీ కల్ల బొల్లి కబుర్లు ఎంతమాత్రం నమ్మలేను... ఒక్కసారి... ఏదో ఎంతో వుత్సాహంతో వచ్చాను... ఒక్కసారి... అంతే, యింక రాను. ఇంక తలచను..."

"ఎందుకు నన్నిట్లా బాధ పెడతావు. నీమీద నా కిదివరకున్న అభిమానం కాస్తా పోతున్నది... నాకు కోపము వస్తున్నది...ఎన్ని విధాల చెప్పినా వినవేం... నా కసహ్యం వేస్తున్నది."

"నాకూ అసహ్యం వేస్తున్నది."

"నీ కసహ్యం వేస్తే వెళ్లిపో...నన్నిట్లా బాధించడ మెందుకు?"

"నీవు వ్రాసిన వుత్తరాలు ఎవరికి యిచ్చిపోదామా అని ఆలోచిస్తున్నాను."

"నేను నీకెప్పుడు వుత్తరాలు వ్రాశానూ?..."

"అవును. నాకప్పుడే తెలుసును నీసంగతి. రెండు సంవత్సారాలనాడు ఎండకాలంలో నేను సెలవలకు యింటికి వెళ్లితే రమ్మని వ్రాశావే...అవి...అవి సుందరరావు గారికి యిస్తే ఎందుకయినా వుపయోగిస్తవి."

"పిచ్చిగా ప్రవర్తించకు"

"తెలివి తక్కువగా ప్రవర్తించకు. ఆలోచించుకో నీ ముందు గతి"

"అయితే నావుత్తరాలన్నీ నాకిచ్చివేయి - నీ కోరిక సఫలం కాకముందే."

"నాకోరిక చెల్లిస్తే నీవుత్తరాల విషయం ఆలోచిస్తాను."

"నావుత్తరాలు ముందు నాకియ్యి."

"అవి ఇక్కడ లేవు."

"అయితే అవన్నీ పట్టుకొనిరా..."

"నాకోర్కి చెల్లిస్తే"

"ముందు పోయి నావుత్తరాలు పట్టుకొని వస్తావా రావా?" అన్నది లలిత. అతను నవ్వుతూ ఆమెను ముద్దుపెట్టుకొన బోయినాడు. ఆమె లేచి తప్పించుకొని గజగజ వణుకుతూ, కండ్లలోనుంచి జలజల నీటిబిందువులు రాలుతూ - ఏమిటో ఆగదిలో కింద వెతుకుతూ - గద్గద స్వరంతో "నావుత్తరాలు నాకిచ్చివేస్తావా లేదా?" అన్నది.

ఆమెను చూసి నవ్వుతో "ఇస్తాలే..." అని అతను అన్నాడు. ఆమె అన్ని మూలల కింద చూస్తూవుంది.



ఇంతలో ఒక మూలకు గిఱుక్కున పరుగెత్తింది. ఏ వస్తువు ఆమె చేత్తో తీసుకొన్నదో అతనికి తెలియలేదు. తక్షణమే తాగా చువ్వలాగు అతన్ని సమీపించింది. "ఏమంటావు. దౌర్భాగ్యుడా - ఏమంటావు..." మాట పూర్తి కానే లేదు: చఢేలు చఢేలు మని అతని దవడమీదా తలమీదా కలకత్తా స్లిప్పరు మడమతో కొట్టింది. అతను బిత్తర పోయినాడు. నాల్గు దెబ్బలుపడ్డ తర్వాత తెప్పరిల్లుకొని ఎట్లాగో అతను లేవబోయినాడు. లేవబోయే సరికి ఆమె మతి అసలే పోయింది. అంతూ పంతూ లేకుండా అదే పనిగా దబదబ కొట్టేసింది. అలిసిపోయింది. చెయ్యి నొప్పి పట్టింది. గుండెలు దడదడ కొట్టుకొంటున్నవి. దాహం అవుతున్నది. సోఫాలో జారగిలబడి పోయింది.

అప్పుడే గాలి సుయిగను వీచింది. కిటికీలో నుంచి గంధప్ మని గాలి వీస్తున్నది. అప్పుడే చంద్రుడు కిటికీలోనుంచి చూసి వెక్కిరిస్తున్నాడు. అలుపు కొంచెం తీరింది. ఎదటి బల్లమీద వున్న మంచినీళ్లు తాగింది. ఇటు చూసేసరికి గోపాలరావు కిందపడి వున్నాడు. ముఖానో తలమీదనో బాగా దెబ్బతగిలి నెత్తురు కారుతున్నది. నిర్ఘాంత పోయింది. ఇన్ని నీళ్లు అతనిముఖాన చల్లింది... చూస్తూ అతనిదగ్గిర కూచుంది. అతను మెల్లిగా తెప్పరిల్లి "అబ్బ... ఎట్లా కొట్టావు...పోనీ..." అని గొణుగుతో ఆమె వక్షఃస్థలం మీద తల ఆనించబోయినాడు. ఆమె అతన్ని ఒక్క తోపు తోసి "ఇంక నా యింట్లోనుంచి నడుస్తావా నడవవా... ఇంకా నీకు ప్రాణం వుందీ... ఇక ఒక్క క్షణం వుంటే బ్రతకనీయను. పోవెధవా - పో...పో...నీ యిష్టము వచ్చినవాడితో చెప్పుకోపో - నీయిష్టం వచ్చిన వాడికి నా వుత్తరాలు చూపించుకోపో - ఇంకా లేవవేం... లే...నడు" అంటూ కాలితో తన్నింది. వీధి గోపాల రావు మెట్లదగ్గిరికి వచ్చేవరకూ తన్నులు తగులుతూనే వున్నవి.

దేహానికి ఆహారము ఎంత అవసరమో వెంట్రుకలకున్నూ అంత అవసరమే

జగత్ప్రసిద్ధమయిన "కామినియా" తైలము (రిజిష్టర్డు)

వుపయోగించండి



రోమరాజము చక్కగా వృద్ధి అయ్యే మూలికలతో అతి బాగుగా చేయ బడినది. చలవ చేస్తుంది. ఇంపు అయిన వాసన వేస్తుంది.

ఒక సీసా 1 రూపాయి. 3 సీసాలు రూ. 2—10—0

వి. పి. చార్జి ప్రత్యేకం. అర్ధణా పోస్టుబిళ్లకు శాంపిలు పంపుతారు

ఒట్టో దిల్‌బహార్



ఆకర్షణీయ మయిన సుగంధము కలది. అనేక అపరూప పుష్పములతో తయారు అయినది. శాంపిలు 2 అణాల బిళ్లకు పంపుతారు. వి. పి. చార్జి ప్రత్యేకం.

వెల పావు ఔన్సు సీసా రూ. 1-4-0. ఒక డ్రామ్ 12 అణాలు

సోలు ఏజంట్లు

ది ఆంగ్లో యిండియన్ డ్రగ్ & కెమికల్ కంపెని

బొంబాయి 2